manachourasta
# మన చౌరాస్తా
The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 203 | ఆదివారం | 19.01.2025



## అర్హులైన ప్రతి ఒక్కరికీ
# సంక్షేమ పథకాలు

- ఇది నిరంతర ప్రక్రియ
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు

**జనగామ, మన చౌరాస్తా :** అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని ఇదొక నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సమాచార పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, జౌళి, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి నూతన రేషన్ కార్డులు జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలపై రాష్ట్ర మంత్రులు సీఎస్ శాంతి కుమారిలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్‌లో ఐడీవోసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేష్ కుమార్ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందచేసే ఈ కార్యక్రమం కొనసాగుతూనే ఉంటుందని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జాభితాలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కుల, సామాజిక, ఆర్థిక సర్వే, పాత రేషన్ కార్డుల ఆధారంగా పేర్లు నమోదు చేయడం జరిగిందన్నారు. వీటిల్లో ఎవరైనా పేర్లు రాని వారుంటే ఈ నెల 21 నుంచి జరిగే గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రులు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి పథకాలు అందజేస్తామని వారు స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో సర్వే జరుగుతుందని, అర్హులైన ప్రతీ నిరుపేదకి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, కొత్త ఆహార భద్రత కార్డు వచ్చేలా సర్వే జరగలాని.. క్షేత్ర స్థాయిలో అధికారులకు ఇప్పటికే పలు మార్లు ఆదేశించినట్లు తెలిపారు. మొదటి విడత లో నిరుపేదలకు ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ మంత్రులకు వివరించారు.



## వేణుగోపాలస్వామి ఆలయంలో జనగామ ఎమ్మెల్యే పూజలు

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణ కేంద్రంలో ఒకటో వార్డులో శ్రీవేణుగోపాల స్వామి దేవాలయాన్ని శనివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్థానిక నాయకులతో సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మంగళగిరి శేషాచార్యులు, రాజు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్ రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, పత్తి వెంకట్ రెడ్డి, మల్లేశం, మంగోల్ చంటి, గదరాజు చందు తదితరులు పాల్గొన్నారు.



## పకడ్బందీగా ప్రభుత్వ పథకాల అమలు

2

- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్



## యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

3

- జనగామ ఏసీపీ చేతన్ నితిన్



## సోమన్న హుండీ ఆదాయం రూ.41.44 లక్షలు

2

- హుండీలో డాలర్లు, పౌండ్లు

General News



# పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

## ▪ అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శనివారం జిల్లాలోని రఘునాథపల్లి మండల పరిధిలో జరుగుతున్న రేషన్ కార్డుల సర్వే తీరును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కుటుంబాల ఆదాయం, ఆస్తులు, పొలాల వంటి తదితర సమగ్ర వివరాలను సేకరించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ అర్హులకు పకడ్బందీగా పథకాలను అమలు చేయాలని, నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆయా పథకాల అర్హుల ఎంపిక ప్రక్రియలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం అదే మండలంలోని ఖిలాషాపూర్ లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, అశ్వరావుపల్లి గ్రామ పంచాయతీలో గల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద గుర్తించిన పనుల పురోగతిలో భాగంగా మిగిలిన పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి, సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే ఇంకా ఏమైనా మరమ్మతుల పనులు ఉంటే ఆయా పనులను వెంటనే గుర్తించి, ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట ఈఈ పీఆర్ శ్రీనివాస రావు, డీఎస్పీడీఓ విక్రమ్, మండల ప్రత్యేక అధికారి జితేందర్ రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస్, తహసీల్దార్ మోసిన్, ఇతర సంబంధిత అధికారులు ఉన్నారు.

# సీపీఐ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## –సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే అశోక్



చేర్యాల, మన చౌరాస్తా : భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ వంద సంవత్సరాల చరిత్రను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అన్నారు. చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు సమావేశానికి మండల కౌన్సిల్ సభ్యులు గూడెపు సుదర్శన్ అధ్యక్షతన వహించారు. అనంతరం పార్టీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రామిక రాజ్యమే లక్ష్యంగా ఆవిర్భవించిన సీపీఐ తెలంగాణ రైతన్న సాయుధ పోరాటం నిర్వహించి దున్నేవాడికే భూమి కావాలని నాలుగు వేల ఐదు వందల మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేసి పదిలక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందన్నారు. ఈ దేశానికి సంపూర్ణమైన స్వాతంత్రం రావాలని అనేకమంది కమ్యూనిస్టు యోధులు పోరాడి స్వాతంత్ర ఉద్యమంలో అమరులయ్యారని గుర్తు చేశారు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి రజాకార్లను తరిమికొట్టిన ఘనత సిపిఐ పార్టీకే దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఒకే మాట ఒకే బాట అనే నినాదంతో ముందుకు సాగి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. వంద సంవత్సరాల పోరాట చరిత్రలో ఎన్నో ఆటుపోట్లను, నిర్బంధాలను ఎదుర్కొని కార్మిక, కర్షక, శ్రామిక ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద స్థానిక సమస్యలపై అలుపెరుగని పోరాటం నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. నేడు ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాల సభకు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, గ్రామ కార్యదర్శి మేనేపల్లి కిష్టయ్య, సీనియర్ నాయకుడు కేసిరెడ్డి బాల్ రెడ్డి, గూడెపు సుదర్శన్, చేర్యాల స్వామి దాసు, కేసిరెడ్డి మల్లారెడ్డి, బాలయ్య, పెంటయ్య, ఎల్లవ్వ, రాజేష్, కనకయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల కాంప్లెక్స్ వద్ద ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సంబధింత అధికారులకు సూచించారు.



# సోమన్న హుండీ ఆదాయం రూ.41.44 లక్షలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి లోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీల కానుకల ఆదాయాన్ని శనివారం కళ్యాణ మండపంలో లెక్కించారు. స్వామివారి కానుకల ఆదాయం రూ.41,44,248 సమకూరినట్లు ఈఓ సల్వాది మోహన్ బాబు తెలిపారు. 2024 మార్చ్ 27 నుంచి 2025 జనవరి 17 వరకు భక్తులు హుండీలో సమర్పించిన 265 రోజుల కానుకల ఆదాయాన్ని లెక్కించామన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఎన్. సంతోష్ రెడ్డి పర్యవేక్ష ణలో ఈ కానుకలను లెక్కించారు. అమెరికా కరెన్సీ నోట్లు 110 (547 డాలర్లు), ఇంగ్లాండ్ 2(20పౌండ్స్), యూరప్1 (1న్యూరోలు), సింగపూర్ 1(2 డాలర్) 5.ఆస్ట్రేలియన్5( 5 డాలర్లు) వచ్చిన్నట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, మహబూబాబాద్ కు చెందిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.



# కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రైతన్నలతో కలిసి కొట్లాడుతామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఆచరణ సాధ్యంగానే హామీలు ఇచ్చి విఫలమైందని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.7500 ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని, రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని ఇప్పటివరకు పూర్తిస్థాయిలో చేయలేదనిఅన్నారు , 22 లక్షల కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి దాన్ని అమలు చేయాలని, భూమి లేని నిరుపేదలకు కోటిమంది ఉపాధి హామీ కూలీలకు 12000 ఇస్తానని చెప్పిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్ రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, నాయకులు ముస్త్యాల నాగేశ్వరరావు, పత్తి వెంకట్ రెడ్డి, సుంకర మల్లేశం, మంగోల్ చంటి,ఉల్లంపల్లి కరుణాకర్, అవుశేర్ల కిషోర్, తాడేం రంజిత, పచ్చిమడ్ల మానసతదితరులు పాల్గొన్నారు.



Local News



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ చేతన్ నితిన్



కోస్టా యాప్‌తో మోసపోయిన బాధితులు

# యాప్‌లతో జాగ్రత్త ఉండాలి

- **జనగామ ఏసీపీ చేతన్ నితిన్**

**జనగామ, మన చౌరాస్తా :** సైబర్ నేరాలు, యాప్‌లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశపడి మోసపోవద్దని జనగామ ఏసీపీ చేతన్ నితిన్ సూచించారు. జనగామలో ఇటీవల 'కొస్టా' యాప్ పేరుతో మోస పోయిన పట్టణానికి చెందిన కె.రాజు, ఇ.జగదీష్, ఎస్.ప్రశాంత్, జి.భాస్కర్‌తో పాటు 30 మంది శనివారం యాప్ ఉద్యోగి శ్రీధర్ యాదవ్‌పై జనగామ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కోస్టా యాప్‌లో పెట్టుబడులు పెట్టి తక్కువ కాలంలో అధిక ఆదాయంతో పాటు కార్లు, బైకులు ఇలా అనేక గిఫ్టులు గెలుచుకోవచ్చని తమను మోస గించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీధర్ మాటలు నమ్మి లక్షల రూపాయల్లో పెట్టుబడులు పెట్టామని వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు ఫైల్ చేశారు. అనంతరం ఏసీపీ మీడియాతో మాట్లాడారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఏజెంట్లను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు ఎవరు యాప్‌లను నమ్మి పెట్టుబడులు పెట్టొద్దని సూచించారు. సమావేశంలో సీఐ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.



# సంవిధాన్ బచావో ర్యాలీలో వీహెచ్

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండల కేంద్రంలో శనివారం రోజున సంవిధాన్ బచావో ర్యాలీని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర సీనియర్ నాయకులు వీహెచ్ హనుమంతరావు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమా లవేసి పాలభిషేకం చేసిన అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ ప్రపంచ మేధావి అయినా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అధికారంలో ఉన్న బిజెపి తరచుగా మార్చుతున్నారని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని, రానున్న రోజుల్లో బిజెపికి గట్టి సమాధానం రాహుల్ గాంధీ అధ్యక్షతన రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ కృషి చేస్తుందని అన్నారు. అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని లేనిప క్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలోజనగామజిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్,,జిల్లా నాయకులుఆగం రెడ్డి, దాసరి కళావతి,దాసరి శ్రీకాంత్, ఆడెపు నరేందర్,ముస్త్యాల యాదగిరి, ఆది శీను, చెరుకు రమణారెడ్డి, సనాది భాస్కర్, చెరుకు సుమలత, ఆరుట్ల వినీత్ తదితరు లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తకు పరామర్శ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** రోడ్డు ప్రమాదానికి గురైన బచ్చన్న పేట మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పయ్యావుల రాజుని బచ్చన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి ,చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల నాగుల శ్వేత వెంకన్న పరామర్శించారు. అనంతరం గాయాల పాలైన రాజు కుటుంబానికి తమ్మడపల్లి మాజీ ఉప సర్పంచ్ మట్టి బాలరాజు గారు ఆర్థిక సహా యాన్ని అందించారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తమ్మడపల్లి గ్రామ శాఖ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాజి రెడ్డి, గొలకొండ రాజయ్య, సానిక రాజయ్య, మహిళా అధ్యక్షురాలు పిల్లి సువర్ణ, కాంసాని మధు, రంగు



అశోక్, కుడుదుల సిద్దయ్య, దొమ్మట సిద్దులు, జెర్రిపోతుల మధు, మా నుల్పాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తకు బాల లక్ష్మి పరామర్శ

**నర్మెట, మన చౌరాస్తా :** తరిగొప్పుల మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ రోజు ఎండ్ల బండ్లు ప్రదర్శనలో జరిగిన ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎనుమల్ల ప్రవీణ్ గాయాలై హైదరాబాద్ గాంధీలో చికిత్స పొంతున్నారు. విషయం తెలుసుకుకున్న బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మి శనివారం గాంధీ హాస్పిటల్ కు వెల్లి ప్రవీణ్‌ను పరామర్శించారు. ప్రవీణ్ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడారు.

## అస్తవ్యస్తంగా రేషన్ కార్డుల జాబితా

- **బీఆర్ఎస్ నేత ఎండీ మాజిద్**




**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సివిల్ సప్లై అధికారులు క్షేత్రస్థా యిలో సర్వే నిర్వహించి విడుదల చేసిన రేషన్ కార్డుల జాబితాలో అస్తవ్యస్తంగా ఉందని బీఆర్ఎస్ నాయకుడు ఎండి. మాజీద్ అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కనీసం సగానికి పైగా పేర్లు జాబితాలో లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఏ ప్రాతిపదికన ఈ జాబితా తయారు చేశారని, ఇంకో లిస్ట్ వస్తుందా.. ఇప్పటికే రేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో వ్యక్తుల పేర్లు చేర్చడం ఎలా అనే విషయాలపై క్లారిటీ లేక జనం ఆయోమయానికి గురవుతున్నారని అన్నారు. కనీసం ప్రజాపాలన దరఖాస్తులైన పరిగణలోకి తీసుకోవాలని, లేదంటే ఈ సర్వేలోనే తమ పేర్లు చేర్చేందుకు అవకాశం ఇవ్వాలని అర్హులు కోరు తున్నట్టు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న వారికి ఈ జాబితా నిరాశే మిగిల్చిందన్నారు. ఇప్పటికైనా ప్ర భుత్వం తూతూ మంత్రంగా సర్వే నిర్వహించి చేతులు దులుపుకోకుం డా అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



## వైద్య సేవలు ప్రజలు వినియోగించుకోవాలి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట గవర్నమెంట్ హస్పిటల్ లో మూడు నార్మల్ ప్రసవాలు జరిగాయి. పోచన్నపేట గ్రామానికి చెందిన నల్ల రజిత, నాగిరెడ్డిపల్లికి చెందిన బండ కవిత, బచ్చన్నపేట గ్రామానికి చెందిన బండారి రజిత బచ్చన్నపేట గవర్నమెంట్ దవాఖానాలో ప్రస వించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాస్పిటల్లో డాక్టర్ శ్రీనివాస్ మా ట్లాడుతూ బచ్చన్నపేట హాస్పిటల్ లో డెలివరీ చేయడానికి ప్రసూతి వైద్య నిపుణులు, 24 గంటలు చూసుకోవడానికి డ్యూటీ డాక్టర్లు అందుబాటు లో ఉన్నారని ఈ సౌకర్యాన్ని బచ్చన్నపేట, చుట్టు పక్కల మండలాల ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. 24 గంటల అంబులెన్స్ కూడా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ స్వరూప్, డాక్టర్ ఆది లక్ష్మి, డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ దీప్తి డాక్టర్ సృజన పాల్గొన్నారు.



## మనోహరంగా
# మాట వినాలి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్ర పాటల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'మాట వినాలి' అంటూ సాగే మొదటి గీతాన్ని నిర్మాతలు ఆవిష్కరించారు. ఈ పాటను స్వయంగా పవన్ కళ్యాణ్ ఆలపించడం విశేషం. సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసే 'మాట వినాలి' లిరికల్ వీడియోతో 'హరి హర వీర మల్లు' సంగీత ప్రయాణం మొదలైంది. 'వినాలి, వీరమల్లు మాట చెప్తే వినాలి' అంటూ తెలంగాణ మాండలికంలో పవన్ కళ్యాణ్ చెప్పే హృద్యమైన పంక్తులతో పాట ప్రారంభమైన తీరు అమోఘం. అందరూ పాడుకునేలా అర్థవంతమైన పంక్తులు, శక్తివంతమైన జానపద బీట్ లతో 'మాట వినాలి' గీతం మనోహరంగా ఉంది. పెంచల్ దాస్ అందించిన సాహిత్యం లోతైన భావాన్ని కలిగి ఉంది. మంచి మాటలను వినడం, వాటి నుండి వచ్చే జ్ఞానం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ అద్భుతమైన సందేశంతో ఈ పాట సాహిత్యం నడిచింది. ప్రతి వాక్యం విలువైన జీవిత పాఠాలను అందిస్తుంది. జీవితంలో సానుకూలత, ధర్మాన్ని స్వీకరించడానికి శ్రోతలను ప్రోత్సహిస్తుంది. అటవీ నేపథ్యంలో చిత్రీకరించిన 'మాట వినాలి' పాట విజువల్స్ ఆకట్టుకున్నాయి. అడవిలో మంట చుట్టూ వీరమల్లు అనుచరుల బృందం గుమిగూడినట్లుగా లిరికల్ వీడియోలో చూపించారు. ఇక పవన్ కళ్యాణ్ గ్రేస్‌ఫుల్ డ్యాన్స్‌లు పాట విడుదలైన కొద్ది నిమిషాల్లోనే సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారాయి. ఎం.ఎం. కీరవాణి స్వరపరిచిన ఈ మనోహరమైన, ఆకర్షణీయమైన గీతం సంగీత ప్రియుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునేలా ఉంది. 'హరి హర వీరమల్లు' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో అలరించనుంది. ఈ క్రమంలో మొదటి గీతాన్ని తెలుగులో మాట వినాలి, తమిళంలో కెక్కనుం గురువే, మలయాళంలో కేల్క్కనం గురువే, కన్నడలో మాతు కేలయ్యా, హిందీలో బాత్ నీరాలి గా విడుదల చేశారు.